క్లుప్తంగా

శాకంబరీగా ముత్యాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ చైర్మన్, భక్తులు

మొగల్తూరు: ఆషాడ మాసం ఆఖరి ఆదివారం కావడంతో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి, అమ్మవారి దర్శనాన్ని కల్పించారు.

స్థిరంగా గోదావరి ప్రవాహం



నరసాపురం వలంధర్‌రేవు వద్ద గోదావరి ప్రవాహ ఉధృతి

నరసాపురం: వశిష్ట గోదావరి ఉధృతి స్థిరంగా కొనసాగుతుంది. గత నాలుగు రోజులుగా పరిస్థితిని పరిశీలిస్తే నీటి ప్రవాహ వేగం క్రమేపీ తగ్గుతుంది. అయితే పూర్తి స్థాయిలో మాత్రం పరిస్థితి అదుపులోకి రాలేదు..స ముద్ర సంగమ ప్రాంతం కావడంతో ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరే కొలదీ ఇక్కడ నీటి మట్టం పెరుగుతుంది. భద్రాచలంలో నీటిమట్టం తగ్గే కొద్దీ..ఇక్కడ నీటిమట్టం పెరుగుతుంది. దీంతో గోదావరిలో స్థానికంగా వరద ప్రవాహ ఉధృతి భయపెడుతుంది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు కొనసాగడం లేదు. మరో నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

శాకాహారమే ఉత్తమం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: శాకాహారమే మనవ శరీరానికి ఉత్తమ ఆహారమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ తాడిమేటి కృష్ణవేణి అన్నారు. ఆదివారం పిరమిడ్ సంస్థ ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ శాఖాహారం మంచి పోషకాహారం అన్నారు. వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని చెప్పారు. మన పూర్వీకులు ఎక్కువ శాతం శాఖాహారం తిని, పరిపూర్ణ ఆరోగ్యంగా జీవించారని తెలిపారు. శాఖాహారం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తరుమాని నాగమల్లేశ్వరరావు, టి.దుర్గా ప్రసాద్, బి.శ్రీనివాస్, కొపనాతి శశికళ పాల్గొన్నారు.

నేటి నుంచి స్వామికి జలాభిషేకం



మొగల్తూరులోని వనమల్లిఖార్జున స్వామి

మొగల్తూరు: మొగల్తూరులో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత వన మల్లిఖార్జున స్వామికి శ్రావణ మాసంలో వచ్చే 5 సోమవారాలు జలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నేటినుంచి ప్రారంభమయ్యే శ్రావణ మాసం సోమవారం నుంచి సెప్టెంబర్ 2 సోమవారం వరకు (5 సోమవారాలు) జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉత్తరాదిన జరుగుతున్న కావిడి యాత్రల మాదిరిగా మన ప్రాంతంలోని వన మల్లిఖార్జున స్వామికి కావడిలతో నీటిని తీసుకువచ్చి జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. శ్రీశైలం తర్వాత స్వామి వారి లింగాన్ని తాకి శాస్టాంగ నమస్కారం చేసే అవకాశం ఉండటంతో భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని కోరుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

యువకుల మధ్య గొడవ

పాలకోడేరు: పని చేసే చోట రెండు వర్గాలకు చెందిన యువకుల మధ్య వచ్చిన తగాదా రెండు కులాల ఘర్షణగా రూపుదాల్చి, కొట్టుకునే పరిస్థితి వరకూ వెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరుకు చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన యువకులు భీమవరంలోని ఒక రొయ్యల కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువకుల మధ్య కొద్ది రోజుల క్రితం ఘర్షణ ఏర్పడింది. దీంతో ఆదివారం బీసీ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది యువకులు ఎస్సీ సామాజిక వర్గం యువకులపై దాడి చేయడంతో అభిరామ్ అనే యువకుడికి గాయం అయింది. గాయపడిన యువకుడు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో 9 మంది యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ విద్య.. తలకిందులు

- పూర్తిస్థాయిలో భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు
- తగ్గిన విద్యార్థుల సంఖ్య
- తల్లికి వందనం కోసం ఎదురుచూపులు
- నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను వెంటాడుతున్న కొరత



నరసాపురం మండలం యిఢ్లపల్లివారితోటలో రేకుల షెడ్డులో నడుపుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

నరసాపురం/నరసాపురం రూరల్/మొగల్తూరు : నరసాపురం నియోజకవర్గం. జిల్లాలో మూరు మూల ప్రాంతం. 19 కిలోమీటర్లు సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఏరియా. తీర గ్రామాల్లో నిరక్షరాస్యత శాతం ఇప్పటికీ తక్కువే. అలాంటి ఈ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న 2019–24 మధ్య ఐదేళ్ల పాటు ప్రభుత్వ విద్య వర్ధిల్లింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలన్నరోజుల్లోనే సీన్ రివర్స్ అయ్యింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది. మరో వైపు తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు హామీకి దిక్కు లేకుండా పోయింది. మొత్తంగా తీరంలో ప్రభుత్వ విద్య దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది.

నియోజకవర్గంలో 193 పాఠశాలలు..

నరసాపురంలో మున్సిపాలిటీలో 35 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 4,486 మంది చదువుతున్నారు. నరసాపురం మండలంలో 86 పాఠశాలలున్నాయి. వాటిలో 5,119 మంది పిల్లలు చదువుతున్నారు. మొగల్తూరు మండలంలో 72 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 4,223 మంది పిల్లలు చదువుతున్నారు. మొత్తంగా నియోజకవర్గంలో 1 నుంచి 10వ తరగతి వరకూ పిల్లలు చదివే పాఠశాలు 193 ఉన్నాయి. వాటిలో 13,828 మంది చదువుతున్నారు. గత ఏడాది 14,400 మంది వరకూ విద్యార్థుల సంఖ్య ఉండేది. ఈ ఏడాది మొత్తంగా 572 మంది వరకూ ప్రైవేట్ పాఠశాలలకు గత్యంతరం లేని పరిస్థితుల్లో వలసలు వెళ్లిపోయారు.

ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. విద్యార్థులకు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కిట్లు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. కొత్త వారికి ఇంకా ఇవ్వడం లేదు. తిథి భోజనం పేరుతో ఉపాధ్యాయులను రోడ్డున పడేస్తున్నారు. ప్రభుత్వ విద్యపై చిత్త శుద్ధితో వ్యవహరించాలి.

– కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, విద్య మౌలిక వసతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

పలు సమస్యలు..

మున్సిపాలిటీలో 35 పాఠశాలల్లో 12 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో 86 పాఠశాలల్లో 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొగల్తూరు మండలంలో 72 పాఠశాలల్లో 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నరసాపురం మండలం యడ్లపల్లివారితోట ప్రాథమిక పాఠశాలలో ఓ రేకుల షెడ్డు అద్దెకు తీసుకొని పాఠశాల తరగతులు నిర్వహిస్తున్నారు. 30 మంది విద్యార్థులుండే ఈ పాఠశాలలో ప్రస్తుతం 8 మంది మాత్రమే మిగిలారు. భారమైనా కూడా తల్లితండ్రులు ఇక్కడ స్కూల్ మాన్పించి టౌన్‌లో కాన్వెంట్‌లో పిల్లలను చేర్పించారు. నరసాపురం మండలం సీతారామపురం, యడ్లపల్లివారితోట, మల్లవరం, తూర్పుతాళ్లు, వేములదీవి, మొగల్తూరు మండలంలో పేరుపాలెం, శేరేపాలెం, మొగల్తూరు టౌన్ గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. మధ్యాహ్న భోజన పథకం అమల్లో కూడా లోపాలు కనిపిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని పలు గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లిప్తత

పెనుగొండ: ప్రభుత్వ విద్యపై నిర్లిప్తత మొదలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు స్వర్ణ యుగం నడిచింది. కాని ప్రభుత్వం మారడంతో రెండు నెలలైనా ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు కనీస పథకాల అమలుపై ప్రభుత్వం నిర్లిప్తతతో వ్యవహరిస్తుంది. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇండెంట్‌ల మేరకే విద్యా కానుకలు ఆయా పాఠశాలలకు అందడంతో కొత్తగా చేరే విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి పాఠ్య పుస్తకాల పంపిణీలోనూ నెలకొంది. కొందరికి కొన్ని పాఠ్య పుస్తకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అరాకొరా అంటూ అధికారులు తప్పించుకొనే యత్నం చేస్తుండడంతో పక్క విద్యార్థిపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు మండలాల్లోనూ ఉపాధ్యాయుల కొరత వెంటాడుతుంది. అయితే సర్దుబాట్ల పేరుతో ఉపాధ్యాయుల కొరత తెలియనివ్వకుండా ఉన్నతాధికారులు ఆదేశాలతో స్థానిక అధికారులు సర్దుబాట్లు చేసి, మండలానికి ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయుల కొరత మాత్రమే ఉన్నారంటూ నమ్మబలుకుతున్నారు. ముఖ్యంగా పెనుగొండలో 13 మంది వరకూ కొరత ఉన్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నా, కేవలం ఒకే పాఠశాలలో ఉపాధ్యాయుడి కొరత నమోదు చేయడం విశేషం. ఇదే పరిస్థితి పెనుమంట్ర మండలంలోనూ ఉంది. సుమారు ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఉంది.

తిథి భోజనం

గోరుముద్ద పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరమైన భోజనం ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త ప్రభుత్వం తిథి భోజనం పేరుతో అదనపు పదార్థాలు ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసినా, నిధులు కేటాయించకుండా కేవలం దాతలపైనే ఆధారపడాలంటూ సూచించడంతో ఉపాధ్యాయులు దాతలను వెతుక్కోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మరోసారి దుర్భర పరిస్థితులు నెలకొన్నాయంటూ పలువురు విమర్శిస్తున్నారు.



యడ్లపల్లివారితోట పాఠశాల తరగతి గదిలో ఐదుగురు పిల్లలే ఉన్న దృశ్యం



ఉపాధ్యాయుల కొరతతో ములపర్రులోని పాఠశాల



నరసాపురం మండలం సీతారామపురంలో మధ్యాహ్న భోజనం పెడుతున్న దృశ్యం

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



చౌడేశ్వరీ దేవికి పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం: ఆషాడ అమావాస్య శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి వేడుకను పట్టణంలోని 18వ వార్డులో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీకర ప్రసాద్, మావూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఆషాడ అమావాస్య రోజున దేవాంగ కులస్తులు చౌడేశ్వరీ దేవి జయంతి వేడుకను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నల్ల నాగరాజు, బల్ల రమేష్, బల్ల జగదీష్ పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: ఆషాడ అమావాస్య సందర్భంగా శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు ఆదివారం పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. దేవాంగ సంఘ మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు (గణేష్) మాట్లాడుతూ ఆషాడ అమావాస్య రోజున చౌడేశ్వరిదేవి జయంతిని దేవాంగ కులస్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడు మానెం బసవరాజు, పట్టణ కోశాధికారి బాసిన సత్యనారాయణ, బాసిన గుణేశ్వరరావు, రొబ్బి భాస్కరరావు, అల్లాడ కుమారస్వామి, యర్రా శివాజీ, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి మానెం గంగాభవాని, వట్టం కిరణ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా పోటీలు



యూటీఎఫ్ ఉపాధ్యాయుల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ దేగల సూర్యప్రభ

యలమంచిలి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ నెల 10న స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మేడపాడు హైస్కూల్లో యూటీఎఫ్ ఉపాధ్యాయులకు టీచర్స్ ఒలింపిక్స్ నిర్వహించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా వాలీబాల్, టెన్నికోయిట్, త్రోబాల్, జావెలిన్ త్రో, చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మేడపాడు ఎంపీటీసీ డేగల సూర్యప్రభ ప్రారంభించారు. కార్యక్రమంలో మేడపాడు మాజీ సర్పంచ్ అడ్డాల వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం సత్యకీర్తి, అడబాల రామ్మోహనరావు, యూటీఎఫ్ నాయకులు పోలిశెట్టి క్రాంతికుమార్, గుత్తిందీవి శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దేవేంద్రుడు

పెనుమంట్ర: మండలంలోని ఎస్ ఇల్లిందలపర్రు, మాముడూరులో వరదల కారణంగా నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు ఆదివారం ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసింది. పెనుమంట్ర మండలం ఎస్ ఇల్లిందలపర్రు, రైతు సేవా కేంద్రానికి 163, మాముడూరు రైతు సేవా కేంద్రానికి 174 విత్తనాల బస్తాలను మంజూరు చేయగా బుధవారం ఎస్ ఇల్లిందలపర్రులో 32 మంది రైతులకు 21.6 క్వింటాళ్లు, మాముడూరులో 35 మంది రైతులకు 24.6 క్వింటాళ్లు ఆ గ్రామ వీఏఏ ఎం.సీతారాం, వి.భూలక్ష్మి పంపిణీ చేశారని ఏఈవో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మాముడూరు గ్రామ సర్పంచ్ గూడూరి దేవేంద్రుడు, పెనుమంట్ర డీసీ మాజీ ఛైర్మన్ వెలగల బులిరామరెడ్డి, శివ శంకర్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



పశువుల దాణా పంపిణీ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి: కూటమి ప్రభుత్వం రైతులు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. యలమంచిలిలంక గ్రామంలో ఆదివారం ఆయన పాడి రైతులకు పశువుల దాణా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల వలన ఆకుమడులు నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు, మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరుమిల్లి చిన్ని, కొడవటి వరబాబు, తదితరులు పాల్గొన్నారు.

మేత బస్తాలు, కోళ్లు చోరీ

ఉండి: ఆక్వా చెరువు వద్ద రొయ్యల మేతబస్తాలు, కోళ్ల దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరుకు చెందిన నంద్యాల ఉదయ భాస్కరరావు అనే ఆక్వా రైతు చెరువులో మేత వేసేందుకు 20 బస్తాలను గత నెల 28వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో తెచ్చుకుని తన ఇంటి వెనుక వాటిని భద్రపరచాడు. అయితే తెల్లవారిన తరువాత అనగా 29వ తేదీ ఉదయం చూసే సరికి 20 బస్తాలతో పాటు ఆరు పెంపుడు కోళ్లు కూడా కనిపించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు కేసు నమోదైంది.

తగ్గని గోదావరి ఉధృతి



కనకాయలంకలో వరద నీటిలోనే కాజ్‌వే మీద నడచి వెళ్తున్న గ్రామస్తులు

యలమంచిలి: గోదావరి శాంతించలేదు. తగ్గినట్లే తగ్గుతూ మళ్లీ గోదావరిలో వరద నీరు పెరగడంతో కనకాయలంక వద్ద కాజ్ వే వరుసగా 13వ రోజు కూడా వరద ముంపులోనే ఉంది. అయితే ప్రమాదకర స్థితిలో వరద నీరు లేకపోవడంతో లంక ప్రజలు అడుగు లోతు నీరు ఉన్న కాజ్ వే మీద నడచి వెళ్తున్నారు. వరద ప్రభావానికి గురైన మిగిలిన లంక గ్రామాలు దొడ్డిపట్ల, పెదలంక, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, ఏనుగువాని లంక, బాడవ గ్రామాలలో వరద పూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఆ గ్రామాలలో పంచాయతీరాజ్, వైద్య శాఖ అధికారులు పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించారు.

భారీగా మొక్కుబడులు

పెనుగొండ: గ్రామ దేవతల ఆలయాల వద్ద భక్తులు భారీ మొక్కుబడులు తీర్చుకొన్నారు. దీంతో ఆచంట మండలంలో మాచేనమ్మ ఆలయం కిటకిటలాడింది. పెనుగొండలోని పెద్దింట్లమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. అదే విధంగా కొండాలమ్మ ఆలయం భక్తులతో నిండిపోయింది.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు

నరసాపురం రూరల్: డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలకు నారుమడులు నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు ఏడీఏ ఈదా అనిల్‌కుమారి తెలిపారు. డివిజన్ పరిధిలో 390.37 ఎకరాలకు సంబంధించిన నారుమడులు పాడైనట్లు గుర్తించామన్నారు. వీరందరికి 80 శాతం రాయితీతో ఎంటీయూ 1153 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించనున్నట్లు ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30 కిలోల విత్తనాల బస్తా పూర్తి ఖరీదు రూ.1,134 కాగా 80 శాతం రాయితీ ధర రూ.907 తగ్గించి కేవలం రూ.227లకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. మంపునకు గురైన నారుమడులు కలిగిన రైతులు ఈ ఎంటీయూ 1153 వరి రకాన్ని ఊడ్చుకోవలసిందిగా ఆమె పేర్కొన్నారు.

మెడికల్ క్యాంపు ఏర్పాటు

పెనుమంట్ర: ఆలమూరులో ఆదివారం భట్లమగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపును నిర్వహించారు. వర్షాలు విస్తృతంగా కురుస్తుండడంతో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ముందు జాగ్రత్త చర్యలుగా గ్రామాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన క్యాంపులో ఆలమూరులో రెండు జనరల్ వైరస్ ఫీవర్స్ నమోదైనట్లు ఆయన తెలిపారు. ప్రతీ ఫీవర్ కేసు ర్యాపిడ్‌కిట్స్, వైడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫీల్డ్ స్టాఫ్ టీంలుగా ఏర్పడి సీజనల్ వ్యాధులపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలమూరు పంచాయతీ పరిధిలో రొటీన్ యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ ఆయిల్ బాల్స్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు .కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ఉండి: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెరుకువాడ చినపేటకు చెందిన ఓ మహిళ పట్ల అదే ప్రాంతానికి చెందిన బొడ్డు మంగరాజు అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటుగా ఆమె కనిపించిన ప్రతీ సారి ఆమెను వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని సదరు మహిళ తన భర్తకు చెప్పడంతో గత నెల 17వ తేదీన అతనిని అడిగేందుకు వెళ్లిన భర్తపై అతడు దాడి చేసినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

672 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం



రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

యలమంచిలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై వర విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి తెలిపారు. మొత్తం 168 ఎకరాలలో నారుమడులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వాటికి అవసరమైన 672 క్వింటాళ్ల ఎంటీయూ–1153 (చంద్ర) విత్తనాలు సిద్ధం చేశారు. 30 కిలోల బస్తా ధర రూ.1134 కాగా 80 శాతం సబ్సిడీ పోను రైతులకు రూ.227లకే విత్తనాలు ఇస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. అవసరమైన రైతులు తీసుకెళ్లాలని ఏవో దేవి కోరుతున్నారు. ఈ విత్తనం 120 రోజుల్లో కోతకు వస్తుందని ఆమె వివరించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



స్నేహితుల దినోత్సవ వేడుకల దృశ్యం

పాలకొల్లు అర్బన్: స్నేహితుడు లేనిదే మానవ జీవితానికి పరిపూర్ణత చేకూరదని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు పట్టణంలోని కొత్త కుళాయి చెరువుగట్టు వద్ద ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్నేహితులు ఒకరికొకరు చేతికి కంకణాలు కట్టుకున్నారు. మిఠాయిలు పంచారు. అలాగే క్లబ్ తరపున చిరు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి శ్రీగంగాపవన్‌కుమార్ సలాది రామచంద్రరావు, ధనాని శ్రీరామమూర్తి, జవ్వాజి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవి అలంకరణలో దుర్గమ్మ



శాఖాంభరిదేవి అలంకరణలో గంగాలమ్మ అమ్మవారు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీ చర్లలో వేంచేసియున్న శ్రీ గంగాలమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరీదేవిగా అలంకరించారు. కూరగాయలు, ఆకు కూరలు తదితర వాటితో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ విధంగా వివిధ రకాల కాయగూరలు, పండ్లతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.